సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

తాండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా, వ్యక్తులను కించ పరిచేలా పోస్టులు చేయరాదని తెలిపారు. గ్రూప్‌ల అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాలన్నారు.

విద్యుత్ పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని ఎస్ఈ రాజన్న, ఏడీఈ వేణుగోపాల్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవారం అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 1 గంట వరకు నిర్వహిస్తామన్నారు. రాంనగర్, ఏసీసీ, రాజీవ్ నగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

అధికారులకు శిక్షణ

తాండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అబ్జర్వర్ శంకర్, జనరల్ అబ్జర్వర్ మనోహర్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎస్ఐ సౌజన్య, డీఎల్‌పీవో సతీష్, జోనల్ అధికారులు సంతోష్, మనోహర్, లత పాల్గొన్నారు.

డీసీసీ చీఫ్‌కు ఎన్నికల పంచాయతీ



- ముఖ్యనేతల సహకారంపై అనుమానాలు
- పదవి చేపట్టగానే ఎన్నికలు రావడంతో ఆందోళన

మంచిర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో నూతనంగా డీసీసీ పదవులు చేపట్టిన వారి సత్తాకు పంచాయతీ ఎన్నికలు పరీక్షగా మారాయి. బాధ్యతలు చేపట్టగానే సర్పంచ్ ఎన్నికలు రావటంతో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడంతో పాటు అన్ని వర్గాలను సమన్వయం చేయడం డీసీసీ చీఫ్‌లకు సవాల్‌గా మారింది. సీనియర్ నేతలు అనేక మంది డీసీసీ పదవిపై ఆశతో దరఖాస్తు చేసుకున్న ప్పటికీ

కొత్త అధ్యక్షుడికి తొలి పరీక్ష..

అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమిం చింది. డీసీసీ అధ్యక్ష పదవి కోసం మంచిర్యాల జిల్లా నుంచి 29 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అధిష్ఠానం సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల అధ్యక్షుడిగా పిన్నింటి రఘునాథ్ రెడ్డిలకు అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. పార్టీ

కొన్ని జిల్లాల్లో సామాజిక సమీకరణల పేరుతో ఊహించని నేతలకు పదవిని కట్టబెట్టారు. అయితే అధ్యక్ష పదవి ఆశించిన నేతల్లోని అసంతృప్తిపై అధిష్ఠానం చర్చించకపోవడంతో పంచాయతీ ఎన్నికల్లో వారి సహకారంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు డీసీసీ చీఫ్‌తో కలిసి పని చేస్తారా...? లేదా అన్నది చర్చ నీయాంశంగా మారింది.

అధికారంలో ఉండటంతో డీసీసీ అధ్యక్ష పదవికి ప్రాధాన్యం పెరిగింది. డీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే పంచాయతీ ఎన్నికలు రావటంతో, మెజారిటీ స్థానాల్లో గెలవటం సవాల్‌గా మారింది. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. 14న రెండో విడత, 17న మూడో విడత ఎన్నికలు జరుగనున్నాయి.

కార్యాచరణ చేపట్టని వైనం..

పంచాయతీ ఎన్నికల ప్రచారంలో డీసీసీ అధ్యక్షులు ఇంకా పూర్తిస్థాయిలో పాల్గొనడం లేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లాలో మాత్రం డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ఇప్పటి వరకు గ్రామాల బాట పట్టనేలేదు. పంచాయతీ ఎన్నికల్లో తమ మార్కును చూపించి, మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను గెలుపు దిశగా పయనించేలా కార్యాచరణ చేపట్టవలసి ఉండగా, ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలేవీ జరగలేదని సమాచారం. కాంగ్రెస్ నుంచి ఆయా నియోజకవర్గాల్లో...

మిగతా 8వ పేజీలో..

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆవిష్కరించారు.

- మంచిర్యాల (ఆంధ్రజ్యోతి)

కమిషనరేట్‌లో బీఎన్ఎస్ఎస్ యాక్టు 163 అమలు..: సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : శాంతియుత ఎన్నికల ప్రక్రియ కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 163 సెక్షన్ అమలులో ఉంటుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జోన్ పరిధిలో, దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలంలో గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు 11వ తేదీన జరగనున్న నేపథ్యంలో డిసెంబరు 9న సాయంత్రం 5 గంటల నుంచి ఫలితాలు ప్రకటించే వరకు బిఎన్ఎస్ఎస్. యాక్టు 163 అమల్లో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు చట్టపరమైన అనుమతిలేకుండా చేపట్టవద్దని సూచించారు. తాత్కాలిక షామియానాలు, పందిళ్ల ఏర్పాటు కూడా అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టవద్దు

పట్టణంలో వ్యాపారస్తుల బంద్ విజయవంతం

బెల్లంపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజార్ ఏరియాలో రోడ్డు విస్తరణ పనులను చేపట్టద్దని మంగళవారం వ్యాపారస్తులు బంద్ పాటించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు బజార్ ఏరియాలో ర్యాలీ చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులతో ఎంతో మంది వ్యాపారులకు నష్టం చేకూరతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాపారస్తుల బంద్‌కు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారస్తులకు నష్టం చేకూర్చే విధంగా మున్సిపల్ అధికారులు రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం సరైంది కాదన్నారు. పట్టణంలో బందుకారణంగా రోడ్లు నిర్మానుశ్యంగా మారాయి.

గొంతులో ఇరుక్కున్న మటన్ ముక్క తొలగింపు



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని కాకతీ య గాస్ట్రో ఆసుపత్రి వైద్యుడు డా. ఆడెపు ప్రవీణ్ వృద్ధురాలు గొంతులో ఇరుక్కున్న మటన్ ముక్కను తొ లగించారు. గోదావ రిఖనికి చెందిన కనక మ్మ అనే 76 సంవ త్సరాల వృద్ధురాలు మటన్ ముక్క ఇరు క్కొని చాలా కాలంగా ఇబ్బందికి గురైంది. కాకతీయ ఆసుపత్రిలో సంప్ర దించగా వైద్యుడు ప్రవీణ్ ఎండోస్కోపీ ద్వారా గొంతులో ఉన్న మటన్ ముక్కను బయటకు తీశారు.

మూడుపంటలు పండేలా చెరువు పూడిక తీయిస్తా

- దొనబండ సర్పంచ్ అభ్యర్థి బేతు రమాదేవిరవి



ప్రచారం చేస్తున్న దొనబండ సర్పంచు అభ్యర్థి బేతు రమాదేవిరవి

హాజీపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటలను సస్యశ్యామలం చేసేందుకు రైతులు మూడు పంటలు పండించే విధంగా దొనబండ గ్రామచెరువులో పూడిక తీయిస్తానని అంటున్నారు సర్పంచుగా పోటీ చేస్తున్న బీజేపీ బలపర్చిన అభ్యర్థి బేతు రమాదేవిరవి. గత పదేళ్లుగా ఎంపీటీసీ, వైస్ ఎంపీపీగా చేసిన అనుభవంతో గ్రామాల్లోని సమస్యలను తీర్చేందుకు సర్పంచు పోటీ చేస్తున్నామని తమను ఆదరించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రజాసేవకే అంకితమవుతానని తెలిపారు. గ్రామంలోని యువత ఉద్యోగాలు సాధించేందుకు లైబ్రరీ ఏర్పాటు చేసి ఉచిత వైఫై సౌకర్యం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున గ్రామానికి కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- కర్ణమామిడి సర్పంచ్ అభ్యర్థి బొడ్డు భూమన్న

హాజీపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనను ఆశీర్వదిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానంటూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన కర్ణమామిడి సర్పంచు అభ్యర్థి బొడ్డు భూమన్న తెలుపుతున్నారు. తమ కుటుంబం 20 ఏళ్లుగా రాజకీయంగా ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం నిస్వార్థ సేవ చేస్తున్నట్లు తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే గ్రామంలోని సమస్యలు తీర్చడమే కాకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని అంటున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సహకారంతో ఎల్లంపల్లి ముంపు గ్రామం అయిన కర్ణమామిడి పంచాయతీలో గ్రామనాయకులను కలుపుకుని పోతూ మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. పంటల సాగుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందించరినట్లు చెబుతున్నారు. గ్రామప్రలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.



ప్రచారం చేస్తున్న కర్ణమామిడి సర్పంచ్ అభ్యర్థి బొడ్డు భూమన్న

ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం

హాజీపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో జరిగే ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. 12 పంచాయతీల్లో 3 రూట్లలో ఉన్న 106 పోలింగ్ కేంద్రాలకు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మెటీరియల్‌ను అంతా సిద్ధం చేశారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎంపీడీవో సాయివెంకటరెడ్డి పర్యవేక్షణలో ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ పోలింగ్ కేంద్రాల వారిగా విభజించారు. 10వ తేదీన 117 మంది ప్రిసైడింగ్ అధికారులు, 157 మంది ఇతర పోలింగ్ అధికారులకు అందజేసే ఎన్నికల సామగ్రిని అందిస్తూ పోలింగ్ సిబ్బంది సమయానికి చేరుకుని పోలింగ్‌కు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేశారు. మూడు రూట్లలో 8 బస్సులు, 1 టాటా ఏస్, 1 కారును పోలింగ్ అధికారులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

జన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొర్రిగూడ గ్రామంలో యాసంగి వరినారులో ఆశించే పురుగుతెగుళ్ల గురించి జిల్లా ఏడీఏ క్రిష్ణ మంగళవారం అవగాహన కల్పించారు. వరినారు రెక్కలపురుగులు గుడ్లు పెట్టే దశలో నాటువేసే నాలుగైదు రోజుల ముందు క్లోరంట నిలిప్రోల్ పిచికారి చేసుకోవాలని నులిపురుగు మొదటిదశలో నివారించడం వల్ల వరినారు బలంగా పెరుగుతుందన్నారు. పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో దివ్య, అధికారులు, రైతులు రాజు, గంగన్న, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 12 పంచాయతీలు ఏకగ్రీవం



మారుపాక రజిత



పానెం మల్లేశ్వరి



గెల్లు లక్ష్మి

మంచిర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 306 గ్రామ పంచాయతీలకు గాను మూడు విడుతల్లో 12 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మరో నాలుగు పంచాయతీలు రిజర్వేషన్లు వర్తించక సర్పంచ్ స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. దీం తో జిల్లా వ్యాప్తంగా 16 పంచాయతీలు పోను మిగతా 290 పంచాయతీల్లో ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడుతల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

ఏకగ్రీవం అయిన పంచాయతీలు ఇవే..

జిల్లాలోని దండేపల్లి మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం కాగా కొండాపూర్, కొత్త మామిడిపల్లి, పాత మామిడిపల్లి, ముత్యంపేట ఉన్నాయి. జన్నారం మండలంలోని లింగయ్యపల్లి, లోత్రాై పంచాయతీల్లో కేవలం ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ఆ రెండింటిని ఎన్నికల అధికారులు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. కన్నెపల్లి మండలంలో ముత్తాపూర్ పంచాయతీ, కాసిపేట మండలంలో ధర్మారావుపేట, కోటపల్లి మండలంలో ఏసన్వాయి, లక్ష్మీపూర్ పంచాయతీలు, చెన్నూరు మండలంలో రచ్చపల్లి పంచాయతీ ఏకగ్రీవంకాగా, మందమర్రి మండలంలో శంకరపల్లి పంచాయతీ ఏకగ్రీవం అయింది.

కోటపల్లి: మండలంలో 31 గ్రామపంచాయతీలుండగా మంగళవారం నామినేషన్‌ల ఉపసంహరణ తర్వాత ఎసన్‌వాయి, లక్ష్మీపూర్ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఎసన్‌వాయి పంచాయతీకి మారుపాక రజిత ఒక్కరే నామినేషన్ సమర్పించగా ఆమె ఏకగ్రీవం కాగా, లక్ష్మీపూర్ పంచాయతీ సర్పంచు స్థానానికి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్‌లు సమర్పించినా ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవ డంతో పానెం మల్లేశ్వరి ఏకగ్రీవమైంది. ఈ స్థానంలో కాంగ్రెస్ ప్రకటించిన దొబ్బల స్వప్న తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో మూల రాజిరెడ్డి వర్గానికి చెందిన పానెం మల్లేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇక ఈ రెండు పంచాయతీల్లోని 8 చొప్పున పూర్తి వార్డుల్లో ఒక్కొక్కరే మిగిలడంతో వార్డు సభ్యులు సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- మండలంలో 29 పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా 110 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 58 వార్డులు ఏకగ్రీవం కాగా ఇంకా 199 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

చెన్నూరు: మండలంలోని రచ్చపల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవమైంది. సర్పంచుగా గెల్లు లక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ సర్పంచు బీసీ మహిళ రిజర్వేషన్ రావడంతో గెల్లు లక్ష్మీ ఆమె కోడలు గెల్లు కొమురక్క ఇద్దరు మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం గెల్లు కొమురక్క తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో గెల్లు లక్ష్మి సర్పంచుగా ఎన్నికయ్యారు. కాగా ఆరు వార్డుల్లో కూడా ఒక్కో నామినేషన్ రావడంతో వారు కూడా ఏకగ్రీవమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్‌ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. మొత్తం 30 గ్రామపంచాయతీలకు గాను సర్పంచు స్థానాలకు 115 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 244 వార్డు సభ్యుల స్థానాలకు గాను 45 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగితా 199 స్థానాలకు 513 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు.

జైపూర్: మండలంలోని 20 గ్రామపంచాయతీలకు గాను 81 మంది సర్పంచు అభ్యర్థులు బరిలో ఉండగా 492 వార్డులకు గాను ఆరు వార్డులు ఏకగ్రీవ మయ్యాయని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. 486 మంది వార్డుసభ్యులో బరిలో ఉన్నట్లు తెలిపారు.

భీమారం: మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉండగా ఏ ఒక్క గ్రామపంచాయతీ కూడా ఏకగ్రీవం కాలేదు. 46 మంది సర్పంచు అభ్యరుక్థులు బరిలో ఉన్నారు. అలాగే 94 వార్డు స్థానాలకు 23 మంది ఏకగ్రీవం కాగా 71 వార్డు స్థానాలకు 167 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మందమర్రిరూరల్: మండలంలో 10 గ్రామపంచాయతీలకు 38 మంది సర్పంచు అభ్యర్థులు బరిలో ఉన్నారు. 164 వార్డుసభ్యులు పోటీలో ఉన్నారు. శంకర్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచు స్థానం ఏకగ్రీవమైంది. పెరుమాళ్ల వెంకటేష్ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. పొన్నారంలో 3వ వార్డు బోర్లకుంట లక్ష్మణ్, ఆరో వార్డులో పెంచాల అమృత ఏకగ్రీవమయ్యారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాపల్లికి చెందిన సాగె శ్రీనివాస్(35) అనే యువకుడు మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జస్పాల్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగె శ్రీనివాస్‌కు పిల్లలు కలగడం లేదని మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జస్పాల్‌సింగ్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన భాస్కర్‌గౌడ్

హాజీపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దంపేట గ్రామానికి చెందిన కోట భాస్కర్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానిక గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం భాస్కర్‌గౌడ్ మంగళవారం సాయంత్రం పెద్దంపేట శివారులోని తాటి వనంలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. మోకు జారడంతో కింద పడిపోగా రెండు కాళ్లు విరిగిపోయాయి. తోటి గీత కార్మికులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలించారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత

జన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిగూడ గ్రామంలో గువ్వల మురళి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను పట్టుకున్నట్టు ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ తమకు అందిన పక్కసమాచారం మేరకు మురళి ఇంటిలో తనిఖీ చేయగా టేకు దుంగలు లభించాయన్నారు. వీటి విలువ సుమారు 30వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. అక్రమంగా కలప నిల్వ ఉంచినా, వన్యప్రాణులకు హాని కల్పించిన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

సందర్శించి.. సూచనలు చేసి

జైనూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచం లొద్ది కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం సందర్శించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, నిర్వాహణ విధానాలను పరిశీలించి తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు విషయాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న మొదటి విడల సాధారణ ఎన్నికల సామాగ్రి పంపిణి ఏర్పాట్లు, లాజిస్టిక్ సకర్యాలను పరిశీలించారు. ఆదేవిధంగా పోలింగ్ సామాగ్రి భద్రత, నిర్వాహణ, సిబ్బంది నియామాకం అవసరమైన మౌలిక వసతు లపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సుమలత, ఎంపీడీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



రామారావుపేటలో పట్టుకున్న మద్యం

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామారావుపేట గ్రామంలో పూదరి మల్లేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు జైపూర్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. మల్లేష్ దుకాణంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంమేరకు తనిఖీలు చేయగా సుమారు 11 వేల రూపాయు విలువ గల మద్యం పట్టుబడిందని, మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న సమయంలో అక్రమంగా మద్యం విక్రయించవద్దని తెలిపారు. మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ బాలయ్య, పోలీసులు మల్లయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

నిధులు లేకుండా నిర్వహణ ఎలా?



- పంచాయతీ ఎన్నికల ఖర్చు భారంతో కార్యదర్శులు సతమతం
- సొంతంగా ఖర్చు పెట్టుకుంటున్న వైనం
- ప్రభుత్వం నుంచి విడుదల కాక అవస్థలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు నిధులు సమస్యగా మారాయి. ఇప్పటికే తొలి, రెండో, మూడో విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈ క్రమంలో నిర్వహణ వ్యయం విడుదల చేయకపోవ డంతో చర్చనీయంశాంగ మారింది. నామినేషన్లు స్వీకరించే క్లస్టర్ కేంద్రాల్లో ఆర్‌ఓ, ఏఆర్‌ఓతో పాటు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరికి అల్పాహారం, భోజనం, తాగునీరు సమకూర్చాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ భవనాల్లోనే క్లస్టరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ఆయా కేంద్రాల ఎదుట నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. రెండేళ్లగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమకూరక ఆర్థికంగా పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులే సొంత డబ్బుతో నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో పంచాయతీ ఎన్నికల ఖర్చు అదనపు ఆర్థిక భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే ఏజెన్సీల ద్వారా క్లస్టరు సిబ్బందికి భోజనం సమకూర్చేందుకు యత్నిస్తు న్నారు. మరి కొందరు గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న హోటల్ యాజమానులను బతిమాలి ఎన్నికల అనంతరం చెల్లింపు బాధ్యత తమదేనంటూ భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

పరిస్థితి అయోమయం..

ఎంకి పెళ్లి సుబ్బిచావుకు అన్నట్లుగా మారింది అధికారుల పరిస్థితి ఆయోమయంగా మారింది. పంచాయతీల ఎన్నికల ఏర్పాట్లకు అధికారుల, కార్యదర్శులకు చేతి చమురు వదులుతోంది. ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా నిధులు ఇవ్వక పోవడంతో ఖర్చు భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో కార్యదర్శుల పాత్ర కీలకం.

అన్ని దశల్లో వారి భాగస్వామ్యం తప్పనిసరి. మరీ ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ నిర్వహణ తదితర దశల్లో వారు ముందుండాల్సి ఉంటుంది. పోలింగ్ సిబ్బందికి అవసరమైనవనీ వారే దగ్గరుండి సమ కూర్చాల్సి ఉంటుంది. ఇందు కోసం కార్యదర్శులు తమ జేబులో నుంచి ఖర్చు పెట్టుకోవల్సిన పరిస్థితి నెల కొన్నది. నామినేషన్ల కేంద్రాల వద్ద అల్పాహారం, భోజ నం, తాగునీరు నామినేషన్లు వేయడానికి వచ్చే వారికి నీడ కోసం టెంట్లు, కుర్చీలు తదితర సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదే. ఉన్నతాదికారుల మౌలిక ఆదేశాలతో కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ప్రస్తుతం వారే భరిస్తున్నారు. దీనితో ఇప్పటికే రూ. 20 నుంచి 35 వేల వరకు ఖర్చు చేసినట్లు కార్యదర్శులు మాటలను బట్టి తెలుస్తోంది. ఎన్నికలు పూర్తయ్యే వరకు మరింత ఖర్చులు పెట్టాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో..

జిల్లాలో 335 పంచాయతీలు 2,874 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించను న్నారు. మొదటి విడతలో జైనూరు, కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యు), వాంకిడి మండలాల్లోని 114 గ్రామ పంచాయతీలు 944 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందు కోసం 944 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ఒక ఓపీఓలతో పాటు 20 శాతం అదనంగా రిజర్వ్ సిబ్బందిని నియమించారు. తొలి విడతలో మొత్తం 2,340 మంది అధికారులు ఎన్నికల విధులకు హాజరు కానున్నారు. రెండో విడతలో బెజ్జూరు, చింతలమా నేపల్లి, కౌటాల, దహెగాం, పెంచికల్‌పేట, సిర్పూర్(టి) మండలాల్లోని 113 పంచాయతీలు 992 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

992 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 2,544 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. మూడో విడతలో కాగజ్‌నగర్, రెబ్బన, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లోని 108 పంచాయతీలు, 938 వార్డు స్థానాలకు 938 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,408 మంది పోలింగ్ సిబ్బందిని ఎన్నికల విధుల కోసం నియమించారు.

పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీఎం మునిగంటి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం అనుమతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ లైజన్ అధికారి సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి మల్లేష్, సంయుక్త కార్యదర్శి రఘురాం, ఏరియా, పిట్ కమిటీ నాయకులు, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వెటర్లు అందజేయాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు స్వెటర్లు సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ మంగళవారం ఒక ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏటా చలికాలంలో సర్ఫేస్‌లో పనిచేసే ట్రామర్, హాలర్ ఆపరేటర్, మ్యాన్‌వే, ల్యాంప్‌రూం, బిట్ షార్ప్‌నర్, మొదలగు కార్మికులకు సింగరేణి యాజమాన్యం గరం కోట్లు సరఫరా చేస్తుందన్నారు. ప్రస్తుత కాలంలో చలి తీవ్రత పెరిగి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా ఇంతవరకు కోట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే సెక్యూరిటీ సిబ్బందికి వానాకాలంలో కోట్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లు, హెల్మెట్‌లు భద్రపర్చుకునేందుకు అన్ని గనులపై లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అయ్యప్ప మహా మండల పడిపూజ



పడిపూజ చేస్తున్న సంజీవ నంబూద్రి గురుస్వామి

శ్రీరాంపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వాములు మహా సంగమం, అయ్యప్ప మహా మండల పడిపూజ నిర్వహించారు. సాయంత్రం వేళ అయ్యప్ప స్వాములు, భక్తులు, మహిళలు మంగళహారతులు, దివ్యజ్యోతులతో శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రగతి స్టేడియం చేరుకున్నారు. అనంతరం కేరళకు చెందిన నంబూద్రి గురుస్వామి దివ్యనెట్టాంబడి, కలశపూజ, అభిషేకం నిర్వహించారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సమితి(ఏబీఏపీ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కిరణ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, పాల్గొని పూజలు చేశారు. అరటిచెట్లతో నిర్మించిన తాత్కాలిక పూజా మందిరాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సంజీవ నంబూద్రి గురుస్వామి మాట్లాడుతూ, దీక్షతో భక్తి పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని, వ్యసనాలు దూరమవుతాయని తెలిపారు. అయ్యప్ప స్వాములు 41 రోజులు దీక్ష తీసుకొని చివరగా స్థానిక ఆలయాల్లో ఇరుముడి అప్పగించి దీక్ష విరమించరాదని, దీక్ష పవిత్రతను తగ్గించవద్దని సూచించారు. అనంతరం మంచిర్యాలకు చెందిన మార్వాడీ కాలు భజనబృదం ఆలపించిన భక్తిగీతాలు అయ్యప్ప స్వాములు, భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. కొందరు భక్తులు, అయ్యప్ప స్వాములు అగ్నిగుండాల్లో నడిచారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత



రాజిరెడ్డి మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన మందల రాజిరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా వారి మనుమడు, మనుమరాలు వర్షిత్, వర్ష రాజిరెడ్డి మృతదేహాన్ని సిమ్స్ మెడికల్ కళాశాలకు దానం చేశారు. ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ మృతదేహాన్ని దానం చేయడానికి ముందుకు రావాలని అన్నారు. మృతదేహాలతో విద్యార్థులు అధ్యయనం చేస్తారని చెప్పారు. సదాశయ ఫౌండేషన్ మృతదేహాలను మెడికల్ కళాశాలకు చేర్చడంలో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. మృతదేహాలు వైద్య విద్యార్థులకు పాఠ్యపుస్తకమని చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అనాటమి హెచ్‌ఓడీ శశికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ప్రతినిధి దబ్బెట శంకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



తుంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడో విడత ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కుర్చీలు, టేబుళ్లు, వెలుతురు సరిపడ ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహించే సిబబందికి తాగునీరు, అల్పాహారం, భోజనం సకాలంలో అందించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహణ, కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వాంకిడి,(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న సర్పంచ, వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించే ఎన్నికల కోసం సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగ కేంద్రం, స్ట్రాంగ్‌రూం, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల్లో వినియోగించే సామగ్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఉమర్‌హుస్సేన్, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాగజ్‌నగర్‌లో ఈఎస్ఐ కొత్త భవనం నిర్మించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని అన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఈఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో ప్రత్యేక గుణాత్మక సవరింపు కార్యక్రమంపై అవగాహన కల్పంచాలని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ షరీఫ్ మంగళవారం సబ్ కలెక్టర్, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపు కార్యక్రమాలపై అందరికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంస్థలో ప్రతి ఉద్యోగి విధిగా రక్షణ సూత్రాలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరుగే అవకాశాలు ఉండవని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ అన్నారు. మంగళవారం ఏరియాలోని కేకే ఓసీలో రక్షణ తనిఖీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఉత్పత్తికి సంబంధించిన పరికరాలను పరిశీలించింది. అనంతరం ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రమాదాలు లేని సింగరేణే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇతర సంస్థలకు సింగరేణిని ఆదర్శంగా నిలుపాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సంస్థలో రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడం ద్వారానే ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. ప్రతి రోజు రక్షణ వారోత్సవాల మాదిరిగానే అధికారులు, ఉద్యోగులు అందరూ పని చేస్తే ప్రమాదాలు ఉండవని తెలిపారు.రక్షణ తనికీ కమిటీ కన్వీనర్ జీఎం ఎస్టేట్ లక్ష్మిపతిగౌడ్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఉద్యోగులు ప్రతి రోజు విధిగా రక్షణ సూత్రాలను అనుసరించాలని ఇది వారికి సంస్థకు, కుటుంబానికి శ్రేయస్కరమని తెలిపారు. విధి నిర్వహణలోనే కాకుండా వాహనాలపై వెళ్లేటప్పుడు కూడ హెల్మెట్‌లు ధరించాలని, ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించా లని తెలిపారు. అంతేగాకుండా ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ కూడ ఉత్పత్తిలో ముందుంటుందని తెలిపారు. విధిగా ఆరోగ్యానికి సంబంధించి ఆహారపు అలవాట్లతో పాటు యోగా , వ్యాయమం చేయాలన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల రక్షణతో పాటు వారి ఆరోగ్యానికి కూడ పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్షణకు సంబంధించి కమ్యూనికేషన్‌సెల్ కళాకారులు ప్రదర్శించిన నాటిక ఉద్యోగులను ఆకట్టుకుంది అంతకు ముందు జీఎం రక్షణ తనిఖీ బృందం జీఎంకు పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి. శ్రీనివాస్, బీరన్న, లక్ష్మీరాజు, టి. శంకర్, నాగేశ్వర్‌రావు, ఎండీ వసీవోద్దీన్, పులిపాక అభిలాష్, రహీమొద్దీన్, వెంకట వంశీధర్, రామరాజు, సంక్షేమాధికారి సందీప్, తదిత రులు పాల్గొన్నారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయిం చారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): రక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కార్పొరేట్ జీఎం(పర్యావరణం), రక్షణ పక్షోత్సవాల తనిఖీ కమిటీ కన్వీనర్ బి. సైదులు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఆర్‌కే 7 గనిలో రక్షణ పక్షోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు రక్షణపై అవగాహన కలిగి ఉండాలని, విధులు నిర్వర్తిస్తున్నప్పుడు వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించి ఉండాలని సూచించారు. సింగరేణి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు వెళ్తోందని, అయినా ఉద్యోగ సమయంలో రక్షణను మరవరాదని అన్నారు. ఆర్‌కే 7 గని నూతన యంత్రాల వినియోగంలో ముందంజలో ఉందని, మహిళా అధికారులు ఈ గనిలో పనిచేయడం గొప్ప విషయమన్నారు. గత ఉత్సవాల్లో గని రెండు రక్షణ బహుమతులు గెలుచుకుందని, ఈసారి అంతకు మించి సాధించాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, ఏజెంట్ రాజేందర్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఏరియ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి సారయ్య, సంక్షేమాధికారి సంతన్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ విభాగం అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి బాలరాజు

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో సెక్యూరిటీ విభాగం ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి చీఫ్‌సెక్యూరిటీ అధికారి బాలరాజు అన్నారు. మంగళవారం ఎస్టీపీపీ జీఎం నరసింహారావుతో కలిసి సెక్యూరిటీ విభాగాన్ని తనిఖీ చేశారు. మూడవ యూనిట్ నిర్మాణ పనులను, మిథనాల్ ప్లాంట్, ఏరియా స్టోర్‌ను సందర్శించి సీఐఎస్ఎఫ్, సెక్యూరిటీ విభాగానికి సూచనలు చేశారు. సీఐఎస్ఎఫ్ కంట్రోల్ రూమ్ మెయిన్ గేట్‌ను తనిఖీ చేసి ప్లాంట్‌లకు వచ్చే ఉద్యోగులు , అధికారులు ఇతర వ్యక్తులను పాసు లేనిదే లోపలికి అనుమతించకూడదని వారికి సూచించారు. అనంతరం సెక్యూరిటీ అధికా రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మురళీధర్, కిరణ్‌బాబు, మహేందర్, వెంకటయ్య, శంకర్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే సింగరేణి ఉద్యోగులకు స్పెషల్ ఎలక్షన్ లీవు బదులు ఆన్‌డ్యూటీగా పరిగణించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు మంగళవారం మందమర్రి జీఎంకు వినతి పత్రం అందించారు. ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టినరేందర్ మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో సింగరేణి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నా ఆన్‌డ్యూటీగా పరిగణించకపోవడంతో చాలా నష్టపోతున్నారని తెలిపారు.

నామినేషన్ ఉపసంహరించుకున్న మాజీ ఎమ్మెల్సీ సతీమణి

కోటపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి గ్రామపంచాయతీ సర్పంచు స్థానానికి నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సతీమణి పురాణం సునంద మంగళవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ పంచాయతీ సర్పంచు అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను విడుదల చేయగా పురాణం సతీష్‌కుమార్ సతీమణి సునంద పేరు లేకపోవడం, ఆ స్థానంలో ఆలూరి సంపత్ పేరు చేర్చడంతో ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయితే పురాణంకు చెక్ పెట్టేందుకే మంత్రి ఎన్నికల సమరంలో తన వర్గీయులకు ప్రాధాన్యం ఇచ్చాడని దీంతోనే సతీష్‌కు చెక్ పెట్టాడనే చర్చ జోరుగా సాగుతుంది.

చెట్టును ఢీకొన్న లారీ

భీమారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలానికి సమీపంగా ఉన్న కుందారం ఎక్స్‌రోడ్డు వద్ద మంచిర్యాల నుంచి చెన్నూరుకు వెళ్తున్న లారీ అధిక స్పీడుతో వచ్చి అదుపు తప్పిచెట్టును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రసూల్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

ఎన్నికల వ్యయం పక్కాగా ఉండాలి

భీమిని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న సర్పంచి, వార్డు స్థానాల అభ్యర్థులతో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో కొమ్మెర సతీష్ మాట్లాడుతూ అభ్యర్థులు నిర్దేశించిన మేరకు ప్రచార ఖర్చులు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లో ఖర్చుల వివరాలను సమర్పించాలని సూచించారు. ఎంపీడీవో గంగామోహన్, తహసీల్దార్ బికర్ణ దాస్, ఎంపీవో మహేష్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, సర్పంచు అభ్యర్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికే మా ఓటు



- మాకు పైసలు.. చీరలు వద్దు...
- మౌలిక సదుపాయాలే ముఖ్యమంటున్న ఓటర్లు
- గ్రామాల్లో సర్పంచ్ ఎన్నిక సందడి
- ప్రజల దృష్టిలో పడడానికి అభ్యర్థుల పాట్లు

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సర్పంచు ఎన్నికల సందడి మొదలైంది. జిల్లాలోని వివిధ పల్లెల్లో సర్పంచ్ ఆశావహులు ఎన్నిక కావడానికి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. గెలుపుకోసం ప్రజలను ఆకర్షించడానికి పలువిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు ప్రజలకు ఇది చేస్తాం అది చేస్తాం అంటూ ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో పడ్డారు. అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీ వరకు సర్పంచ్ ఓట్లు ప్రచారంకోసం ప్రయత్నాలు గట్టిగా జరుగుతున్నాయి. కొందరేమో మహిళలకు చీరలు పంచాలని ప్లాన్ చేసుకుంటుండగా మరికొందరు పురుషులకు డబ్బు, మద్యం పంపిణీ చేయాలని ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఈ తరుణంలో ఓటర్లు మాత్రం తమకు ఇవేమి వద్దని గ్రామాన్ని అభివృద్ధి చేయడమే కావాలని కోరుతున్నారు. అబివృద్ధి చేయడమంటే గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని వర్గాల మధ్య బేధాభిప్రాయాలు లేకుండా ఒకరిని ఒకరు గౌరవించుకునేలా ఉండేలా వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అభివృద్ధి చేసే వారికే తమ ఓట్లు పడతాయని ఇవే తమ ఎజెండా అని చెబుతున్నారు.


ఇవి చేస్తే మా ఓటు మీకే

రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలి. పల్లెల రూపురేఖలు మార్చాలి. అన్ని వీధులకు తాగునీటి సదుపాయం కల్పించాలి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ఆటోల్లో, ప్రైవేటు వాహనాల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్‌షెల్టర్లను నిర్మించాలి. గ్రామాలు, తండాల్లో అవసరమైన రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలి. చిన్న వయస్సులతోనే యువత మద్యానికి బానిసవుతున్నారు. పేద ప్రజలు మద్యంతో రోడ్డున పడుతున్నారు. అందుకే మద్యం, బెల్టు దుకాణాలను మూసివేయించాలి. దీంతో కుటుంబ తగాదాలు, వర్గవిబేదాలు ఉండవు. పిల్లలు, యువత కోసం గ్రామానికో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

ఇందులో రెండు, మూడు రకాల దినపత్రికలు, అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచాలి. పల్లెల్లోని క్రీడా మైదానాలు నిధులు లేక నిర్వహణకు నోచుకోవడంలేదు. వాటిని చదును చేయించి ఆడుకునేలా పరికరాలను సమకూర్చాలి. రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలను నిర్మించాలి. పంటలను నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులను ఏర్పాటు చేయాలి.

ఓటరు చేతిలోనే గ్రామ భవిష్యత్తు

నెన్నెల,(ఆంధ్రజ్యోతి): ఓటు అనేది ఒక వజ్రాయుధం. దాన్ని సక్రమంగా వినియోగించుకుంటే అవినీతి అంతం చేయడం సాధ్యమే. గొప్ప శక్తి గల ఓటును సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో అవినీతికి చోటు లేకుండా పరిపాలన సాగించే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలి. విద్యావంతులను, సామాజిక అంశాలపై అవగాహన ఉన్న వారిని, నిజాయితీగా పనిచేసేవారిని, ప్రజాసేవకు కంకణబద్ధులై ఉన్నవారిని ఎన్నుకునేలా ఓటరుండాలి. గ్రామాభివృద్ధికి పాటుపడేవారికి ఓటేయండి. డబ్బు, మద్యం, కానుకలకు ప్రభావితం కావద్దు. ఓటుకు విలువ కట్టే వారి నోటుకు అమ్ముడు పోవద్దు. మంచి చేస్తారనే నాయకుడికే ఓటేసి గెలిపించాలి.



ఇలాంటి నేతకు పట్టం కట్టండి

- ప్రజల సమస్యలు, వారి అవసరాలపై అవగాహన ఉన్న వారికే పెద్దపీట వేయాలి.
- ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు సొంతంగా తీసుకునే లక్షణం గల వారికి పదవి అప్పగించండి.
- గౌరవ వేతనం, అధికార మర్యాదలు తప్ప మరో లాభం ప్రయోజనాలను ఆశించని వారికి మీ మద్దతు తెల్పండి
- ప్రజల సొమ్ము ప్రతి రూపాయికి బహిరంగంగా లెక్క చెప్పే వారై ఉండి, వ్యవహార శైలి పారదర్శకంగా ఉన్న వారికి ఓటేయండి.
- అభివృద్ధి పట్ల ముందు చూపు కలిగి ఉండి, గ్రామ భవిష్యత్ కోసం ప్రణాళిక రూపొందించే సమర్థత ఉన్న వారి వైపు మొగ్గు చూపండి.
- గ్రామంలోని అన్ని వర్గాలను కలుపుకుని పోయే లక్షణం ఉన్న వారిని ఎన్నుకోండి.
- ఉన్నతాధికారులను ఒప్పించి నిధులు తెప్పించే సామర్థ్యం ఉన్న లీడర్ ఉంటేనే ప్రగతి పనులు సాగుతాయి.
- ప్రజల్లో మమేకమయ్యే లక్షణం ఉండి ప్రజల సమస్యలపై వెంటనే స్పందించడం, కష్టసుఖాల్లో పాలుపంచుకునే వారికే పట్టం కట్టండి.
- ప్రజాభీష్టంగా సుపరిపాలన అందించే నేతకే ఓటేసి గెలిపించుకోండి.
- సమర్థ నాయకుడిని ఎన్నుకొని ఓటురుగా మీరూ గెలువండి.

డీసీసీ చీఫ్‌కు ఎన్నికల 'పంచాయతీ'

(5వ పేజీ తరువాయి..)

ఎమ్మెల్యేలు గెలుపు బాధ్యతలను తమ భుజ స్కందాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారు. అయితే డీసీసీ అధ్యక్షుడు ప్రచారంలో విరివిగా పాల్గొనడం లేదనే చర్చ నడుస్తోంది.

మంత్రి గడ్డం వివేక్ ప్రాతినిథ్యం వహిస్తున్న చెన్నూరు నియోజకవర్గం నుంచే డీసీసీ అధ్యక్షుడి నియామకం జరిగింది. మంత్రికి సన్నిహితుడు కావడంతో ఆ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడిపై పెద్దగా భారం పడే అవకాశాలులేవు. అయితే మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గంలో మాత్రం ఆయన కొత్త సవాళ్లను ఎదుర్కోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రఘునాథ్‌రెడ్డి ఇప్పటివరకు కేవలం మంత్రితోనే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో ఆయన దూరంగా ఉంటున్నట్లు కార్యకర్తలు చర్చించుకుంటు న్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల గెలుపు బాధ్యత నూతన డీసీసీ అధ్యక్షుడిపై ఉండటంతో అగ్నిపరీక్షగా మారిందనే ప్రచారం జరుగుతోంది.

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అధాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లాప్రధాన న్యాయమూర్తి వీరయ్య అన్నారు. మంగళవారం న్యాయవాదులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశం ప్రకారం ఈ నెల 21 ఆదివారం నిర్వహించే లోక్ అధాలత్‌కు రాజీ ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎ నిర్మల, న్యాయవాదుల ఉపాధ్యక్షులు భుజంగ్‌రావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో అనిత తనిఖీ చేశారు. రిజిష్టర్‌లను, నిల్వ ఉన్న మందులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు, గర్భిణులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఆమె వెంట అధికారులు ప్రశాంతి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, అరుణశ్రీ తదితరులు ఉన్నారు.

సిర్సాలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి

కోటపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సాలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఈ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు, రామగుండం సీపీకి వినతిపత్రాలు అందించారు. ఇక్కడ అధికార పార్టీకి చెందిన నాయకులు వారి అనుచరులతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులను బెదిరింపులకు గురి చేస్తున్నారని, గతంలో సైతం ఇలాంటి దాడులు, బెదిరింపులు జరిగాయని, ఉద్రిక్తపరిస్థితులు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని వినతి చేశారు. కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు పెద్దింటి పున్నంచంద్, సంజీవరెడ్డి, అంకయ్య, జనగామ స్వామి , గ్రామస్థులు 50 మంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు సందర్శించిన తహసీల్దార్

తాండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపల్లెవాడలోని అంతర్‌జిల్లా చెక్‌పోస్టును మంగళవారం మండల తహసీల్దార్ జ్యోత్స్న సందర్శించారు. వచ్చి పోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదినం





మంచిర్యాల, చెన్నూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ, కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంచి ర్యాల పట్టణంలో డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. సోనియా గాంధీ కృషితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూముల నరేష్, పూదరి తిరుపతి, బొల్లం భీమయ్య, బొలిశెట్టి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నారాయణ, ఖలీల్, హఙు, నారాయణ, శ్రీధర్, నాగరాజు, మహేష్, జావీద్, కమలాకర్, ఇబ్రహీం, వెంకటేష్, శ్రీనివాస్, సలీం, నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ జడ్పీటీసీ గడ్డం నాగరాణి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, నాయకులు పెంట రజిత, రాజేశ్వర్, రాజన్న, సత్తయ్య, మహేష్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, నాయకులు రాందేని వెంకటేష్, గుత్తికొడ శ్రీధర్, నవాబ్, అమీర్, చంద్రమౌళి, రాజు, దేవా పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నాయకులు సూరిబాబు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని ఆవడం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకురాలు భాగ్యలక్ష్మీ, పద్మశాలిసంఘం నాయకులు ఉన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు సొత్కు సుదర్శన్, ఎండీ జమీల్, ఎండీ పాషా, పైడిమల్ల నర్సింగ్, తిరుమల్ రెడ్డి, లక్ష్మణ్, చిన్నదేవుడు, రాయబారపు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, భూమేశ్, రమేశ్, ఇందయ్య, హేమంత్, గంగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దండేపల్లి డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డేవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. మంగళవారం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తాళ్ళపేట, ఆల్లీపూర్, లక్ష్మీకాంతపూర్, నాగసముద్రం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. కానీ ప్రజాపాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి పేదవాడికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతుల కోసం అవసరమైన నిధులు కేటాయించి గ్రామాల అబివృద్ధికి పాటుపడిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ముఖ్య నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి



వెంకటాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి, పోలీసులు

మందమర్రిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం చిర్రకుంట, పొన్నారం, వెంకటాపూర్, పులి మడుగు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సీఐ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేయాలన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాల న్నారు. కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలు రాజశేఖర్, రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

కోటపల్లి: గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి, గొడవలు అల్లర్లకు తావు లేకుండా ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సిర్సా గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కోటపల్లి, చెన్నూరు ఎస్ఐలు రాజేందర్, సుబ్బారావు, జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైపూర్ అటవీ సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్



పులి పాదముద్రలు

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జైపూర్ అటవీ ప్రాంత పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు పాదముద్రలను గుర్తించినట్లు జైపూర్ అటవీ సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్ మంగళవారం పేర్కొన్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని అటవీ పరిసర ప్రాంతాలను ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలను పులి సంచారంపై అప్రమత్తం చేశామన్నారు. రైతులు పత్తి చేన్లకు పశువుల కాపర్లు ఒంటరిగా అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దన్నారు. హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒక మామిడితోటలో, వేలాల ఇసుక క్వారీ వద్ద పెద్దపులి పాదముద్రలను గుర్తించామన్నారు. ప్రజలు ఎవరు కూడా పులికి హానీ తలపెట్టవద్దని, పులి కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. పులి కదిలికలపై నిఘా పెంచామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయన్నారు. ట్రాక్ కెమెరాలు, మానవ నవరుల ద్వారా పులి కదలికలకు గమనిస్తున్నామన్నారు. పులికి రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు.

48 గంటల పాటు వైన్ షాప్‌లు బంద్

- ఎక్సైజ్ సీఐ సమ్మయ్య

దండేపల్లి డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరిగే మొదటి విడుత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో దండేపల్లి మండల పరిధిలోని రెబ్బనపల్లిలో ఒకటి, మ్యాదరిపేటలో రెండు వైన్ షాప్‌లను 48గంటల పాటు మూసివేస్తున్నట్లు లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ సీఐ సమ్మయ్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 11 గురువారం రాత్రి వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ పరిదిలోని ఒక బార్ షాప్‌తో పాటు మూడు మండలలోని 12 వైన్ షాప్‌లను తమ సిబ్బందితో మద్యం దుకాణాలకు సీజ్ వేసి మూసివేశారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట ఎక్సైజ్‌శాఖ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఎన్నుకోవాలి

జన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంలో పొన్కల్ సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మభూమేశ్‌ల ఆధ్వర్యంలో పొన్కల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై మంగళవారం భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్‌లనే ఎన్నుకోవాలని కాంగ్రెస్ పార్టీ పేద బడుగుబలహీనవర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతుందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరు గ్యారంటీలను అమలుపరుచడమే కాకుండా మహిళలకు ఇచ్చిన మాట మేరకు ఉచిత బస్సు సంక్షేమ పథకాలు అందించడంలో మాట నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ముజాఫర్ అలీ, లక్ష్మీనారాయణ, ఫసియుల్లతో పాటు ఇందయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఈ నెల 17న జరిగే మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు మండలంలో 30 గ్రామపంచా యతీలకు గాను ఒక గ్రామపంచాయతీ ఏకగ్రీవం కాగా 29 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మొదటి విడత ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ మొదటి విడత ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని తెలిపారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, పోలీసులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. న్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోహర్, వ్యయ పరిశీకులు రాజేశ్వర్, డీసీపీ భాస్కర్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు,జెడ్పీసీఈవో గణపతి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

దండేపల్లి డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు మరింత అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మంగళవారం మండలంలోని మ్యాదరిపేట, లింగాపూర్, తాళ్ళపేట గ్రామాల్లో అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినతకాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి పథకాలను అమలు చేసిందన్నారు. ఈనెల 11న జరిగే పంచాయతీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులందరిని బారీ మోజర్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శి అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, మాజీ జెడ్పిటిసి గడ్డం నాగరాణి, మాజీ ఎంపీపీలు అక్కల శకుంతల, మెటపల్కుల గురువయ్య, కాంతరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హాజీపూర్: గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. పడ్తనపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలి

భీమారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పరిమళ అనే ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం ఎదుట ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠ శాలలో 1 నుంచి 5 తరగతులు ఉండగా 67 మంది విద్యార్థులు చదువుతున్నా రన్నారు. హెడ్మాస్టర్‌తో పాటు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని, వీరిలో ఒక ఉపాధ్యాయురాలు డిప్యూటేషన్‌పై వెళితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదని తెలిపారు. వెంటనే ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎంఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇదే మండలం లో రెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశా లలో విదులు నిర్వహిస్తున్న రాజేశం అనే ఏకోపాధ్యాయుడు అకాడమిక్ ఇన్‌స్పెక్షన్ టీమ్ మెంబర్‌గా సెలెక్ట్ కావడంతో ఆ పాఠశాలకు పరిమళ అనే ఉపాధ్యాయురాలిని ఓరల్ ఇన్‌స్ట్రక్షన్‌తో పంపించామని తెలిపారు.

'తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన కేసీఆర్'





మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న బాల్క సుమన్, నాయకులు, మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ..

మందమర్రిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆత్మబలిదానాలు, ప్రజా పోరాటాలతో తెలంగాణ స్వరాష్ట్ర కళ సాకారమైందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ విజయ్‌దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో దీక్షా విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు గాదె సత్యం, అంకం నరేష్, ఎండీ మహమూద్, సింగిల్ విండో చైర్మన్ సందెల వెంకటేష్ పాల్గొన్నారు.

చెన్నూరు: తెలంగాణ రాష్ట్ర ప్రకటన దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మంగళవారం చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం దీక్ష విజయ్ దివస్ వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సబ్బని అరుణ్, నూనె సత్యనారాయణ, మద్దెల గోపి, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జైపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్వ బస్టాండ్ సమీపంలో ఇసుక ట్రాక్టర్ కారు ఢీకొన్న ఘటనలో పోడేటి మల్లయ్య (70) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8న చెన్నూరు నుంచి మంచిర్యాలకు ఓ వాహనంలో భీమారం మండల కేంద్రానికి చెందిన పోడేటి మల్లయ్య వెళ్తున్నాడు. నర్వ బస్టాండ్ సమీపంలో ముదిగుంట వాగు నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడి భార్య రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

- జైపూర్‌కు చెందిన కొంత మంది ట్రాక్టర్ యాజమానులు ముదిగుంట వాగు నుంచి రాత్రి వేళలో ఇసుక తరలిస్తున్నారు. డ్రైవర్లు మద్యం మత్తులో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు స్పందించి రాత్రివేళలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాండ్ పేపర్‌తో సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

నెన్నెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చక పోతే తన పేరిట ఉన్న రెండెకరాల పదకొండు గుంటల భూమిని జప్తు చేసుకోవాలని రాసిన బాండ్ పేపర్‌తో మంచిర్యాల జిల్లా నెన్నెల సర్పంచ్ అభ్యర్థి దుగ్యాల బాపు ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు మరి కొన్ని హామీలతో ప్రత్యేక మేనిఫెస్టోతో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు.

- ఎన్నికల వేళ మరోసారి తెరపైకి సరిహద్దు గ్రామాలు
- ఆరు వేల జనాభా, 3,150 మంది ఓటర్లు
- 35 ఏళ్లుగా తెగని పంచాయతీ


కెరమెరి మండలం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని పరందోళి గ్రామం

ఒకే ఓటరు.. రెండు రాష్ట్రాలు

ఆసిఫాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాలోని 12 గ్రామాలు రెండు రాష్ట్రాల పరిధిలో ఉంటాయి. ఇటు తెలంగాణ అటుమహారాష్ట్ర ప్రభుత్వాలు ఈ గ్రామాలు మావంటే మావేనంటూ మూడున్నర దశాబ్దాలుగా పోటాపోటీ గా ఇక్కడ పాలన చేస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల వేళ మరోసారి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలో ఉన్న తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లోని వివాదాస్పద గ్రామాలు తెరపైకి వచ్చాయి. రెండు ప్రభుత్వాలు ఇక్కడ ఇంటింటికీ రేషన్ కార్డులు ఇచ్చాయి. రేషన్ షాపులూ ఏర్పాటు చేశాయి. రెండు ప్రభుత్వాలు పాఠశాలలను ఏర్పాటు చేశాయి. ఇక్కడ రెండు ప్రభుత్వాలకు సంబంధించిన ఓటరు ఐడీ కార్డులను ఓటర్లు పొంది ఉన్నారు.ఆ గ్రామాల నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మె ల్యేలు, సర్పంచులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆ గ్రామాల్లో అన్నీ డబుల్ ధమాకే..

తెలంగాణ, మహారాష్ట్ర మధ్య వివాదస్పందంగా మారిన ఆ 12 గ్రామాల ప్రజలకు అన్నీ డబుల్ ధమాకే. రెండురెండే ఇటు తెలంగాణ ప్రభుత్వం, అటు మహారాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మొదలుకుని పాఠశాలలు, రహదారులు, తాగు నీటి పథకాల వరకు అన్ని రెండు మంజూరు చేస్తూ వస్తున్నాయి. ఒకే గ్రామానికి ఇద్దరు సర్పంచ్‌లు, రెండు పాఠశాలలు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ముఖ్యమంత్రులు అన్నట్లుగా అటెండర్‌ను మొదలుకుని ఐఏఎస్ దాకా అన్నీ డబుల్ దమాకే. ఆ ఊర్లలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటుంది. ఇంకా విచిత్రమేమిటంటే తెలంగాణ నుంచి సర్పంచ్‌గా పని చేసిన వ్యక్తే మహారాష్ట్ర ఎన్నికలు రాగానే ప్లేట్ ఫిరాయింది మహారాష్ట్ర నుంచి ఎన్నిక కావడం ఈ గ్రామాల విశిష్టత.

1989లో కేకే నాయుడు కమిషన్..

ఇరు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదంగా మారిన నేపథ్యంలో ఈ 12 గ్రామాల భవితవ్యం తేల్చేందుకు 1989లో కేంద్రం కేకే నాయుడు కమిషన్ నియమించింది. ఈ గ్రామాల స్థితి గతులు, భౌగోళిక పరిమాణం, సంస్కృతి సంప్రదాయాలు, రవాణా సదుపాయాలు వంటి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాత పరందోళి పంచాయతీని విభజించి అంతాపూర్ పేరుతో మరో పంచాయతీని ఏర్పాటు చేయాలంటూ సిఫారసు చేశారు. వీటి పరిధిలోని మిగిలిన పది గ్రామాలు కూడా ఆంధ్రప్రదేశ్‌కే చెందాలని మహారాష్ట్ర రాజధాని ముంబైలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించి కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం ప్రత్యేక జీవోతో ఈ గ్రామాలను తెలంగాణలో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థుల సహకారంతో కోర్టుకు వెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కేసు వ్యవహారం ఏటూ తేలకుండా పోయింది. తాము ఏ రాష్ట్రాలకు చెందిన వారో తేల్చుకోలేక గ్రామస్థులు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ వ్యవహారం ఎన్నికలు సందర్భాల్లో మాత్రమే ప్రముఖంగా తెరపైకి వస్తోంది.

ఈ గ్రామాల పరిధిలో 11న పోలింగ్..

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో వివాదాస్పదంగా ఉన్న 12 గ్రామాల్లో ఈనెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలో తెలంగాణ మహారాష్ట్ర మధ్య ఉన్న పరందోళి, ముఖద్దంగూడ, అంతాపూర్, బోలాప టార్ పంచాయతీల పరిధిలోని 12 సరిహద్దు వివాదాస్పద గ్రామాలు ఉన్నాయి. పరందోళి పంచాయతీ పరిదిలో పరందోళి, కోటా, శంకర్‌లోద్ది, ముఖద్దంగూడ పంచాయతీ పరిధిలో మహారాజ్ గూడ, ముఖద్దంగూడ, అంతాపూర్ పంచాయతీ పరిధిలో అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, బోలాపటార్ పంచాయతీ పరిధిలో బోలాపటార్, లెండిగూడ, గౌరి గ్రామాలు ఉ న్నాయి. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో ఆరువేల పై చిలుకు జనాభా ఉంది. ఇందులో 3,150 ఓటర్లు ఉన్నారు. ఏ పంచాయతీకైనా ఒకే సర్పంచ్ ఉం టారు కానీ ఈ వివాదాస్పద గ్రామాల్లో ఇద్దరు సర్పంచ్‌లు ప్రాతినిధ్యం వహి స్తుంటారు. ఇక్కడి ఓటర్లకు ఇటూ తెలంగాణ అటూ మహారా ష్ట్ర ఎన్నికల్లో ఓటు హక్కు, పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ గ్రామాల వివాదం సుప్రీంకోర్టులో ఉంది. కోర్టు సూచనల మేరకు సరిహద్దు వివాదం పరిష్కారమయ్యే వరకు పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు రెండు రాష్ట్రాల్లోను ఓట్లు వేసేలా అవకాశం కల్పించారు. ఈ మేరకు వారికి రెండు రాష్ట్రాల ఓటరు కార్డులు ఉంటాయి. ప్రస్తుతం తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడతలో ఈనెల 11న పోలింగ్ జరుగనుండగా బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

సౌకర్యాలు కల్పించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు తౌటం శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అన్ని వసతులు సమకూర్చాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలకు కాగజ్‌నగర్ శివ బాక్సింగ్ చెందిన ముగ్గురు బాక్సర్లు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో అంకిత్ మాల్వియా, ప్రభాత్, సుమిత్, తివారి ఉన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఆడనున్నట్లు కోచ్‌లు నివాస్ గౌడ్, వినయ్ యాదవ్ తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల సంఘం కమిషన్ సభ్యులతో కలిసి మంగళవారం వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, సాధారణ, వ్యయ పరిశీలకులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన చర్యలు, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఓటర్ల ప్రభావితం అంశాలను అరికట్టడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు లోబడి ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని, ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో వీసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోతేర, ఎస్పీ నితికాపంత్, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీఓ భిక్షపతిగౌడ్, నోడల్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా ఐదు మండలాల్లో 106 గ్రామ పంచాయతీ సర్పంచ్, 327 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేశామని చెప్పారు. స్టేజ్-2 ఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ అందించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సామగ్రి పంపిణీ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాటు చసి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఐదు మండలాల ఎంపీడీవో, పోలీసు అధికారులతో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

సిర్పూర్(టి), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఈ నెల 14న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని డీఎస్పీ వహీదుద్దీన్ ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అన్ని ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 14న జరిగే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. రూట్ మ్యాప్‌ను డీఎస్పీ తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై సురేష్, ఉన్నారు.

సర్పంచ్ బరిలో 151 మంది

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలో 28 గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ అభ్యర్థులుగా 151 మంది నిలిచారు. మొత్తం 194 మంది తమ నామినేషన్ దాఖాలు చేశారు. రెండురోజులుగా స్రూనిటి కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఇందులో సరిగ్గా పత్రాలు సమర్పించని వారికి, డబుల్ నామినేషన్ దాఖాలు చేసిన పత్రాలు తొలగించగా 151 మంది బరిలో ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. కాగజ్‌నగర్ మండలం రేగులగూడ నుంచి ఒకే ఒక నామినేషన్ దాఖాలు చేసిన సుశీల ఏకగ్రీవమాయ్యరు. అధికారులు దీన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

తప్పుడు కులధ్రువీకరణ పత్రం జారీ

కాగజ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రెవెన్యూ అధికారులు మూడు రోజుల క్రితం ముస్లిం మహిళకు హిందువుగా ధ్రువీకరణ పత్రం జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. నాలుగు రోజుల క్రితం కోసిని గ్రామ పంచాయతీకి సర్పంచ్ బరిలో ఉండేందుకు అక్తర్ బేగం కులం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు మాత్రం మాలి కులస్థురాలిగా సర్టిఫికెట్‌గా జారీ చేశారు. అధికారులు నామినేషన్‌లో వేరిఫికేషన్ చేస్తుండగా ఈ వ్యవహారం బయటపడింది. తక్షణమే అక్తర్ బేగం తిరిగి దరఖాస్తు చేసుకోగా, నూతన సర్టిఫికుట్ అందజేశారు. వ్యవహారం వైరల్ కావడంతో అధికారులు దీనిపై ఆరా తీస్తున్నారు.

ఒకరికి 14 రోజుల రిమాండ్

తిర్యాణి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం గిన్నెధరి రేంజ్ పరిధిలోని పంగిడి మాదర బీట్ నుంచి టేకు దుంగలను అక్రమంగా తరలిస్తున్న గోపెర గూడకు చెందిన పెందూర్ శంకర్ అనే వ్యక్తికి మంగళవారం సిర్పూర్(టి) కోర్టు న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు అటవీ శాఖాధికారిణి సరోజినిరాణి తెలిపారు. ఆమె వెంట సెక్షన్ ఆఫీసర్ రాంసింగ్, డ్యూటీ ఆఫీసర్ రవి, వాచర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క క్యాంపు కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్యాం, వెంకటేరెడ్డి, మంగ, సత్తయ్య, విజయ్, ఇందిర, విజయ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

ఆసిఫాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రలోని కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.15.50 లక్షలతో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టరేట్ అధికారులు, రహదారుల భవనాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం జయ జయహే గీతాన్ని ఆలపించారు.

ఘనంగా దీక్షా విజయ్ దివస్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ స్వరాష్ట్ర సాధన కోసం 11 రోజుల పాటు అమరణ దీక్ష చేపట్టి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వెలువడేలా చేసిన చారిత్రక రోజు డిసెంబరు 9ని పురస్కరించి బీఆర్‌ఎస్ నాయకులు దీక్షా విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలం గాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అలీబిన్ అహ్మద్, సరస్వతీ, పోచన్న, అహ్మద్, సిసార్, వెంకన్న, నారాయణ, అశోక్, అహ్మద్, జావెద్, సాజిద్, అన్సార్, రవి, సలాం, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి


పెంచికలపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

పెంచికలపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండో విడత ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. మండలంలోని పోతెపల్లి, లోడ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రశాంత వాతావ రణలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ తిరుపతి, ఎంపీడీవో ఆల్బర్ట్ ఉన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లగూడ, పోలింగ్ కేంద్రాలను మంగళవారం కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి మంగళవారం పరిశలించారు. అలాగే కమ్మర్‌పల్లి, కుంచవెల్లి పోలింగ్ కంఏద్రాలను తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీఓ నస్రుల్లాలు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, వసతులు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్సై విక్రమ్, కార్యదర్శులు ఉన్నారు.

ఉడకని భోజనం పెడుతున్నారని విద్యార్థుల ఆవేదన

కౌటాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉడకని అన్నం, పప్పు రుచి లేకుండా పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. భోజనం తినలేక బయట పడేసి బస్టాండు ఏరియాలోని హోటళ్లు, బేకరీలలో బిస్కెట్‌లు, కర్రీపప్, బజ్జీలు, సమోసాలు తిని ఆకలి తీర్చుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు హోటళ్లు, బేకరీల వద్ద ఉండడంతో విషయం బయటకు వచ్చింది. మంగళవారం భోజనంలో అన్నంతో పాటు పప్పు ఆకుకూర కలిపి పెట్టారు. అది కూడా నీళ్లగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. పదిరోజుల క్రితం నాసిరకం భోజనం పెడుతున్నారని అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు రోడ్డెక్కి అందోళన చేపట్టారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి స్పందించి ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసి డ్యూటీలో ఉన్న టీచర్‌కు షోకాజు నోటీసు అందజేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించారు. తాత్కా లికంగా ఐకేపీ తరఫున మహిళా సంఘాల నుంచి భోజనం వండేందుకు నియమించారు. కానీ కొత్తగా నియమించిన వారు కూడా సరిగ్గా వండడం లేదన్న ఆరోపనలు వస్తున్నాయి. తాజాగా ఉడకని భోజనం పెట్టడం చర్చనీయాంశం అవుతుంది. దీనిపై ఎంఈవో హనుమంతును వివరణ కోరగా హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో అన్నం ఉడకని విషయం దృష్టికి వచ్చిందని చెప్పారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని హెచ్ఎంకి సూచించినట్లు ఎంఈవో తెలిపారు.


విద్యార్థులు పడేసిన భోజనం

పల్లె పోరు

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు


మాట్లాడుతున్న ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మంగళవా రం జిల్లా పోలీసు కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో గురువారం ఎన్నికల నేపథ్యంలో శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు బందో బస్తు సంసిద్ధం చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సైలెంట్ పీరియడ్ అమలు, పోలింగ్‌కు 44 గంటల ముందు నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు సైలెంట్ పీరియడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్ స్పీకర్ వినియోగం, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తి నిషేదమని, ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పహార, నిఘా బృందాలు, రూట్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొదటి విడత ఎన్నికల కోసం 550 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, 200 మంది ఇతర వాఖల సిబ్బంది మొత్తం 750 మందిని నియమించి పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి ఎనినకు పూర్తయ్యే వరకు జిల్లాలో 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమల్లో ఉంటుందని చెప్పారు. ఎన్నికల పరిసరాల్లో 100మీటర్ల పరిధిలో ఐదుగురు, ఆ పైగా వ్యక్తులు గుంపులుగా ఉండకూడదని సూచించారు.

పోలీసుల కవాతు


రెబ్బెనలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రెబ్బెన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెబ్బెన మండలంలోని రెబ్బెన, నంబాల, నారాయణపూర్ గ్రామ పంచాయతీల పరిధి లో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంజయ్ మాట్లాడుతూ ప్రజలందరూ గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరుపుకోవాలని, ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలు పెట్టుకుంటే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసులకు ఎప్పుడు ప్రజల శాంతి భద్రతలు ముఖ్యమన్నారు. ఎల్లప్పుడు ప్రజలకు తోడుగా ఉంటారని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా ఎన్నికల నిబంధనలకు లోబడి ఎన్నికలు సజావుగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటకృష్ణ, వెంకటేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

లింగాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జైనూర్ సీఐ రమేష్ లింగాపూర్ ఎస్సై గంగన్న అన్నారు. లింగాపూర్ మండలంలో కొత్తపలి, మోతిపట్టార్ గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ర జలతో మాట్లాడారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా స ్వనియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా డబ్బులు , మద్యం పంచుతున్నట్లు గుర్తిస్తే పోలిసులకు సమాచారం అం దించాలని అన్నారు. కార్యాక్రమంలో 50మంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ బరిలో సొంత అన్నదమ్ములు


మధుకర్, గోపాల్

వాంకిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనర్‌గాం గ్రామ పంచాయతీలో సొంత అన్నదమ్ముల మధ్య పోటీ ఏర్పడింది. పంచాయతీ రిజర్వేషన్ ఎస్టీ జనరల్ రావడంతో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ మద్దతుతో పెందూర్ గోపాల్, బీఆర్ఎస్ మద్దతుతో పెందూర్ మధుకర్ పోటీలో ఉన్నారు. పెందూర్ మధుకర్ గతంలో రెండు సార్లు రిజర్వేషన్ కలిసిరావడంతో సర్పంచ్‌గా గెలుపొందగా పెందూర్ గోపాల్ పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ప్రస్తుతం మూడో సారి సర్పంచ్‌గా పోటీ పడుతున్నారు.. ప్రధాన పార్టీలు బలపర్చిన ఇద్దరు అన్నదమ్ములు పోటీ ఉండడంతో ఈ పంచాయతీలో ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయని చెబుతున్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ

కెరమెరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేస్లాగూడ రైతు వేదికలో మంగళవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర ట్రైనీ ఆసిఫ్ పీఓఎస్, ఓపీఎస్‌లకు బ్యాలెట్ బాక్సు నిర్వహణ, పోలింగ్ జరిగే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌కుమార్, తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఎంపీవో సాయిరాంగౌడ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బెజ్జూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, కార్యదర్శి తుకారాం పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి సిద్ధం చేస్తున్న అధికారులు

సిర్పూర్(టి), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 14న నిర్వహించే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే ఎన్నికల కోసం సామగ్రిని సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 144 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని ఈడెన్‌గార్డెన్ పాఠశాల ఆవరణలో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని గోయగాం, కోటారి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మంగళవారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అన్నారావు, బాపు, పాండు, నారాయణ, వాసు, జ్ఞానేశ్వర్, భీంరావు, దేవ, దినేష్, నిఖిల్, బాపూజీ, అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.